


యువత తగ్గి..

## వృద్ధులు పెరిగి..!

# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

తెలుగు దిన పత్రిక

అనుక్షణం ప్రజల పక్షం...

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 1 సంచిక - 222 బుధవారం 21 ఆగష్టు 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts




## వైద్యుల రక్షణ కోసం నేషనల్ టాస్క్ ఫోర్స్

ఆర్జీ కర్ వైద్యురాలి హత్యాచారం కేసు విచారణలో భాగంగా ఏర్పాటు చేసిన సీజేఐ ధర్మాసనం

మూడు వారాల్లో మధ్యంతర నివేదిక ఇవ్వాలని ఆదేశించిన సుప్రీం బెంచ్

శాంతియుతంగా నిరసన చేస్తున్న వారిని ఇబ్బంది పెట్టొద్దంటూ బెంగాల్ ప్రభుత్వానికి సూచన

## రాజీవ్ విగ్రహం టచ్ చేస్తే

# అంతుచూస్తాం

సీఎం రేవంత్ హెచ్చరిక

- ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి
- నివాళులర్పించిన కాంగ్రెస్ లీడర్లు
- బీఆర్ఎస్ నేతలకు సమాధానంగా సీఎం ప్రసంగం
- డిసెంబర్ 9 లోపు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు




## బెయిల్ అంశాల్లో ఆలస్యమెందుకు?




ఎమ్మెల్సీ కవిత కేసులో

ఈడీని ప్రశ్నించిన సుప్రీంకోర్టు


తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదా

## రుణమాఫీపై ప్రభుత్వం దోబూచులాట

22న రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలకు బిఆర్ఎస్ పిలుపు

మండల, నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు

వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ పిలుపు



హైదరాబాద్, ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త): :రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ, ఈనెల 22వ తేదీన అన్ని మండల కేంద్రాలు,నియోజకవర్గ కేంద్రాల్లో బీఆర్ఎస్ ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ మేరకు ధర్నాలు చేపట్టాలని బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపునిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో రైతన్నలు కాంగ్రెస్ పార్టీ రుణమాఫీ ప్రయోజనం పొందకపోవడంతో ఆందోళన చేస్తున్నారని అన్నారు. ఒకవైపు రాష్ట్ర ముఖ్యమంత్రి రెండు లక్షల వరకు అందరికీ రుణమాఫీ అయ్యిందని చెబుతుంటే.. మంత్రులు మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తికాలేదని.. కార్యక్రమం కొనసాగుతుందని చెబుతున్నారని అన్నారు. ఎవరికీ తోచిన విధంగా వారు మాట్లాడుతూ రైతన్నలను అయోమయానికి, ఆవేదనకు గురిచేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికలకు ముందు రెండు లక్షల వరకు రుణమాఫీని అందరికీ వర్తింపజేస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టంగా హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తుచేశారు. మిగతాది 2లో...






## తెలంగాణలో ఆరుగురు ఐఏఎస్‌ల బదిలీ

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలికి పూర్తి బాధ్యతలు

ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు తొలగింపు

మూసీ రివర్ డెవలప్ మెంట్ ఎండీగా దాన కిషోర్

హెచ్ఎండిఏ మేనేజింగ్ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహ్మద్

కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా చాహత్ బాజ్ పాయ్

## పోచారం కి కేబినెట్ హోదా




రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం

తెలంగాణ డెయిరీ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్‌గా గుత్తా అమిత్‌రెడ్డి

## వానతో ఆగమాగం

జూబ్లీహిల్స్, బేగంపేట తదితర ప్రాంతాల్లో భారీ వర్షం

అప్రమత్తమైన జీహెచ్ఎంసీ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

హుస్సేన్ సాగర్ నుంచి 1600 క్యూసెక్కుల నీరు విడుదల



హైదరాబాద్ ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్‌లో మరోసారి భారీ వర్షం కురుస్తోంది. మంగళవారం సాయంత్రం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బేగంపేట, పంజాగుట్ట, ఉప్పల్, బోడుప్పల్, నాగోల్, కొత్తపేట, సరూర్ నగర్, వనస్థలిపురం తదితర ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తోంది. ఈ ఉదయం కురిసిన భారీ వర్షంతో తడిసిముద్దయిన నగరం... ఈ సాయంత్రం కురిసిన వర్షంతో అతలాకుతలమైంది. పలుచోట్ల వర్షం నీరు రోడ్ల పైకి చేరడంతో ట్రాఫిక్ జామ్ అయింది. జీహెచ్ఎంసీ సిబ్బంది, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అప్రమత్తమయ్యాయి.నగరంలో భారీ వర్షం కురవడంతో హుస్సేన్ సాగర్‌లోకి వరదనీరు వచ్చి చేరుతోంది. హుస్సేన్ సాగర్‌లో మంగళవారం మధ్యాహ్నం నాటికి నీరు దాదాపుగా ఫుల్ ట్యాంక్ లెవల్ కు చేరుకుంది. హుస్సేన్ సాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 514.75 అడుగులు కాగా, మధ్యాహ్నం సమయానికి 513.63 అడుగులకు నీరు చేరుకుంది. సాగర్‌లోకి 1850 క్యూసెక్కుల నీరు వస్తుండగా, గేట్లు ఎత్తి 1600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

## భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

: కలెక్టర్లతో పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్




## రైతురుణ మాఫీపై దొంగ లెక్కలు




మంత్రి ఉత్తమ్ సమాధానమే దీనికి జవాబు

రాజీవ్ విగ్రహం పెట్టడం దారుణం

మేం వచ్చాక తొలగిస్తామన్న జగదీశ్ రెడ్డి

# రాజీవ్ విగ్రహం టచ్ చేస్తే అంతుచూస్తాం

హైదరాబాద్, ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త):
ప్రస్తుతం తెలంగాణలో విగ్రహాల వార్ నడుస్తోంది. విగ్రహాలకు సంబంధించి అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టాలన్న అధికార కాంగ్రెస్ తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంలో విపక్ష బిఆర్ఎస్ గట్టిగానే విమర్శలు చేస్తోంది. సమస్యలను పక్కదారి పట్టించే డ్రామాలంటూ బిజెపి మరోవైపు ఎదురుదాడికి తెగించింది. తాము అధికారంలెకి వస్తే సెక్రటేరియట్ ముందు రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఘాటు వ్యాఖ్యలు పెనుదుమా రాన్ని రేపుతున్నాయి. కేటీఆర్ కామెంట్స్‌పై రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ జాగ్రత్త అంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు. రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా సోమాజీగూడలో రాజీవ్ విగ్రహానికి సీఎం నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. ఎవడికైనా చేతనైతే రాజీవ్ గాంధీ విగ్రహం ముట్టుకోండి. రాజీవ్ విగ్రహాన్ని ముడితే చెప్పు తెగే దాకా కొడుతాం. రాజీవ్ విగ్రహం ఎవరు ముడుతారో, ఎప్పుడు ముడుతారో చెపితే మా జగ్గారెడ్డిని పంపిస్తాం. తాగుబోతులు, దొంగల విగ్రహాలకు సచివాలయం ముందు స్థానం లేదు. తొందరలోనే రాజీవ్ విగ్రహాన్ని ఆవిష్కరించు కుందాం. పండగ వాతావరణంలో రాజీవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకుందాం. రాజీవ్ విగ్రహాన్ని పెడతామంటే తొలగిస్తామని కొందరు సన్నాసులు అంటున్నారు. అధికారం పోయినా బలుపు తగ్గలేదు. బలుపును తగ్గించే బాధ్యత కాంగ్రెస్ కార్యకర్తలు తీసుకుంటారు. వాళ్ల అయ్య విగ్రహం పెట్టుకోవాలని కేటీఆర్ అనుకుం టున్నాడు. వాళ్ల అయ్య పోయేదెప్పుడు? విగ్రహాన్ని పెట్టేదెప్పుడు. ఉద్యమం ముసుగులో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొన్నారు. తాగుబోతు సన్నాసి విగ్రహం సెక్రటేరియట్ ముందు పెడుతారా?. తెలంగాణను దోచుకున్న దొంగ విగ్రహం పెట్టాలా అని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. పొద్దున లేస్తే తాగేవాడి విగ్రహాన్ని సెక్రటేరియట్ ముందు పెడుతారా? నీ అయ్య విగ్రహం కోసం రాజీవ్ విగ్రహాన్ని తొలగించాలని అంటావా?. అధికారంలోకి వస్తే అని మాట్లాడుతున్నాడు... బిడ్డా.. మీకు అధికారం ఇక కలనే.. ఇక మీరు చింతమడకకే పరిమితం. పదేళ్లు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టని వాళ్లు ఇప్పుడు తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడుతున్నారు. డిసెంబర్ 9న సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసే బాధ్యత మాది. మా చిత్తశుద్ధిని ఏ సన్నాసి శంకించనవసరం లేదు. విచక్షణ కోల్పోయి అర్థంపర్థం లేని మాటలు మాట్లాడితే తెలంగాణ సమాజం మిమ్మల్ని సామాజిక బహిష్కరణ చేస్తుంది. కలలో కూడా నీకు అధికారం రాదు. పది సంవత్సరాల్లో తెలంగాణ తల్లి విగ్రహం గుర్తు రాలేదా? బీఆర్ఎస్ నాయకులు ఇష్టమున్నట్టు మాట్లాడితే సామాజిక బహిష్కరణ చేస్తాం. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం పెడతాం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశంలో విప్లవాత్మక మార్పులకు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ శ్రీకారం చుట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని కొనియాడారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలు ఆయన హయాంలోనే బలోపేతం అయ్యాయని తెలిపారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు ఘనంగా నివాళులు అర్పించారు. పంజాగుట్టలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా భారాస నేతలపై సీఎం మండిపడ్డారు. అధికారం పోయినా.. వారికి అహంకారం తగ్గలేదని విమర్శించారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని అంటున్నారని.. అనవసర ఆరోపణలు చేస్తే భారాస నేతలను తెలంగాణ సమాజం బహిష్కరిస్తుందని హెచ్చరించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని రాష్ట్రంలో ప్రారంభిస్తామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను యంగ్ ఇండియా రెసిడెన్షియల్ అకాడమీలుగా మారుస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వి.హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చిన తొలిరోజే బాబాసాహెబ్ అంబేడ్కర్ సచివాలయం పరిసరాల్లోని చెత్తను తొలగిస్తా మని విమర్శించారు. నా మాటలు గుర్తుపెట్టుకో చీఫ్ మినిస్టర్ అని రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. నీలాంటి ఢిల్లీ గులాములు తెలంగాణ ఆత్మగౌరవాన్ని, తెలంగాణ ఖ్యాతిని అర్థం చేసుకోలేరని సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. చిన్న పిల్లల ముందు చెత్త మాటలు మాట్లాడిన రేవంత్ రెడ్డి నైజం, వ్యక్తిత్వం ఆయన పెంపకాన్ని సూచిస్తుందని అన్నారు. మానసిక రుగ్మత నుంచి రేవంత్ రెడ్డి త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని పరిస్థితులు ఎలా ఉన్నాయో వివరించేందుకు ఇవే తార్కాణాలు అని ట్విట్టర్ వేదికగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రెండు ఫొటోలను కూడా ఆయన షేర్ చేశారు. నిజామాబాద్‌లో పోలీసుల వేధింపులతో విసుగుచెందిన ఓ స్వీట్ షాపు యజమాని తన దుకాణాన్ని మూసివేస్తూ ఒక బ్యానర్ పెట్టారని తెలిపారు. ఒకవైపు ఇలా నిజామాబాద్‌లో చిన్న వ్యాపారులను వేధించడంలో బిజీగా ఉంటే.. మరోవైపు వరంగల్‌లోని రద్దీ రహదారిపై నిర్వహించిన కాంగ్రెస్ మంత్రి కొండా సురేఖ పుట్టిన రోజు వేడుకల్లో ఏసీపీ పాల్గొన్నారని వెల్లడించారు. ఈ వేడుకల్లో క్రాకర్స్ కాల్చడం వల్ల అమాయకులు గాయపడ్డారని మండిపడ్డారు.

# బెయిల్ అంశాల్లో ఆలస్యమెందుకు?

న్యూఢిల్లీ: ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త):
బెయిల్ అంశాల్లో కౌంటర్ల దాఖలుకు ఆలస్యమెందుకో అర్థం కావడం లేదని సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం జస్టిస్ బీఆర్.గవాయి, జస్టిస్ కేవీ.విశ్వ నాథన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. కవిత తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గి వాద నలు వినిపిస్తూ.. మహిళగా కవిత బెయిల్‌కు అర్హురాలు అని తెలిపారు. కేసులో సహ నిందితు డైన సిసోడియాకు బెయిల్ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.అయితే కేసులో సీబీఐ కౌంటర్ దాఖలు చేయగా, ఈడీ కౌంటర్ దాఖలు చేయ లేదని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ.రాజు ధర్మాసనానికి తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం.. బెయిల్ అంశాల్లో కౌంటర్ల దాఖ లుకు ఆలస్యమెందుకు? కోర్టులో కేసు డైరీతోనే నిర్ణయం ఉంటుందంటూ ఈడీ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. పీఎంఎల్ఏ సెక్షన్ 45లో కఠిన నిబంధనల నుంచి మహిళగా కవితకు మినహాయింపు ఉందని ముకుల్ రోహత్గి ప్రస్తావించగా... పీఎంఎల్ఏ కఠిన నిబంధనలు ఎందుకెలా వర్తి స్తాయో కింది కోర్టుల న్యాయమూర్తులు వివరణా త్మక కారణాలు తెలిపారని ధర్మాసనం వ్యాఖ్యాని ంచింది.కవితకు ఎందుకు బెయిల్ ఇవ్వలేదో హైకోర్టు కారణాలు వివరించిందని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సమయంలో కవితకు మధ్యంతర ఊరట కల్పించాలని ముకుల్ రోహత్గి కోరగా. ధర్మాసనం నిరాకరించింది. ఈడీ బుధ వారం కౌంటర్ దాఖలు చేస్తే శుక్రవారం వాద నలు వినిపిస్తామని రోహత్గి తెలిపారు. దీంతో, ఈడీ తరఫు కౌంటర్ దాఖలు చేయడానికి గురు వారం వరకూ సమయం ఇవ్వాలని రాజు కోరగా, అదేరోజు కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని, శుక్రవారం రిజాయిండర్ దాఖలు చేయా లని పిటిషనర్‌ను ఆదేశించిన ధర్మాసనం.. తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా వేసింది.

# తెలంగాణలో ఆరుగురు ఐఎఎస్‌ల బదిలీ

హైదరాబాద్:ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త):
ఆమ్రపాలికి అదనపు బాధ్యతలు తొలగింపు: ఐఏఎస్ ఆమ్రపాలికి ఉన్న అదనపు పోస్టులను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. హెచ్‌ఎండిఏ జాయింట్ కమిషనర్, మూసీ రివర్ బోర్డ్‌కు ఎండీ, గ్రోత్ కారిడార్‌కు ఎండీగా ఉన్న పోస్టులను తొలగిస్తూ జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి పూర్తి స్థాయి బాధ్యతలను రేవంత్ రెడ్డి సర్కార్ అప్పగించింది. ఇక మీదట జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి పూర్తి స్థాయిలో పని చేయనున్నారు. నగర ప్రజల నుంచి వస్తున్నఫిర్యాదులు పెరిగిపోతుండటం,హైదరాబాద్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఆమ్రపాలికి ఉన్న అదనపు పోస్టులను తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. జీహెచ్‌ఎంసీ కమిషనర్%శ్రీ%గా ఆమ్రపాలి సిటీలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ అధికార యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్న సంగతి తెలిసిందే. కేంద్రం పరిధిలో పని చేస్తున్న ఐఏఎస్ అధికారిణి అమ్రపాలి ఇటీవల రాష్ట్ర సర్వీసులకు వచ్చిన విషయం విదితమే.

ఆరుగురు ఐఏఎస్ అధికారుల బదిలీ: తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి కాటా, హెచ్‌ఎండీఏ జాయింట్ కమిషనర్‌గా కోట శ్రీవాత్స, మూసీ రివర్ డెవలప్ మెంట్ ఎండీగా దాన కిషోర్, హెచ్‌ఎండబ్లుఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మయాంక్ మిట్టల్, హెచ్‌ఎండిఏ మేనేజింగ్ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహ్మద్, కరీంనగర్ మున్సిపల్ కమిషనర్‌గా చాహత్ బాజ్ పాయ్‌ను ప్రభుత్వం నియమించింది. చాహత్ బాజ్ పాయ్ ఐటీడీఏ పీవోగా కూడా గతంలో పనిచేశారు. అసిఫాబాద్ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కూడా విధులు నిర్వహించారు.

# పోచారం శ్రీనివాస రెడ్డికి కేబినెట్ హెూదా

హైదరాబాద్:ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త):
కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. అంతకు ముందు చెప్పినట్లుగానే ఆయనకు తెలంగాణ ప్రభుత్వ సలహాదారుడిగా నియమించి, కేబినెట్ హెూదాను కల్పించారు. అలాగూ గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున టికెట్ ఆశించి భంగపడిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు గుత్తా అమిత్‌రెడ్డిని తెలంగాణ డెయిరీ కో-ఆపరేటివ్ ఫెడరేషన్‌కు ఛైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంట్ ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న బీఆర్ఎస్‌లో ఉంటే తనతో పాటు కుమారుడి రాజకీయ భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకం అవుతుందనే ఉద్దేశంతో పోచారం సొంతగూటికి వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు.ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఆయన ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి రావాలంటూ ఆహ్వానించారు. దీంతో ఆయన జూన్ 21న సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. చేరిక సమయంలో పార్టీలో సముచిత గౌరవం కల్పిస్తామని, కేబినెట్ హెూదా పదవి ఇస్తామని కూడా హామీ ఇచ్చారు. అదేవిధంగా బీఆర్ఎస్ నుంచి మునుగోడు టికెట్ ఆశించిన గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌కు కేసీఆర్ మొండిచేయి చూపించారు. దీంతో తీవ్ర అసంతృప్తితో కొన్నాళ్ల పాటు సైలెంట్‌గా ఉన్న అమిత్ అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన చేరికను బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న తండ్రి గుత్తా సుఖేందర్ రెడ్డి సైతం సమర్థించారు. అయితే ఇచ్చిన మాట మేరకు పోచారంకు కేబినెట్ హెూదాచ గుత్తా అమిత్ భవిష్యత్తును దృష్టిలో పెట్టకుని కార్పొరేషన్ పదవి ఇవ్వడం పట్ల రేవంత్ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారనే టాక్ కాంగ్రెస్ పార్టీలో మారుమోగుతోంది.

# రైతురుణ మాఫీపై దొంగ లెక్కలు

హైదరాబాద్, ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త):
కాంగ్రెస్ పాలనపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి ఫైర్ అయ్యారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పగటి దొంగలా దొరికిందని ఆరోపించారు. మంగళ వారం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో ఆ పార్టీ విధానాలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..17 లక్షల 13 వేల మందికి రుణ మాఫీ చేయలేదని స్వయంగా మంత్రి ఉత్తమ్ ఒప్పుకున్నారు. రూ.31 వేల కోట్లు పూర్తిగా చేయటానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.ఇది ఏ తేదీలోపు చేస్తారో స్పష్టంగా హామీ ఇవ్వాలన్నారు. సీఎం రుణ మాఫీ పూర్తయిందని డ్యాన్సులు చేస్తు న్నారు. మంత్రులు మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం చెప్పింది అబద్ధమని ఉత్తమ్ మాట లతో అర్దమవుతున్నది. ఇప్పుడు రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేస్తావా? చెంపలు వేసుకుంటావా? అని సూటిగా ప్రశ్నించారు. ప్రతిపక్షంగా ఇంకా మేము పని మొదలు పెట్టలేదు. ముందు ముందు మా తడఖా ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. ల్గ÷తులు ఆందోళన చేస్తే భయపెట్టిస్తారు. పోలీస్ స్టేషన్‌లో పెడతారు. మీరు ఎన్ని కుట్రలు చేసినా బీఆర్ఎస్ మాత్రం రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలన్న మా డిమాండ్ పై సీఎం రేవంత్ తెలివి లేకుండా మాట్లాడుతున్నారు. తెలంగాణ సోయి, ఆత్మ లేని వ్యక్తులు సచివాలయంలో ఉండటం ఖర్మ అని ప్రజలు అనుకుంటున్నారు. ఖచ్చితంగా మేము అధికారం లోకి రాగానే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామన్నారు. రాజీవ్ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో లేదంటే రేవంత్ తన ఇంట్లోనో పెట్టుకోవాలని సూచించారు. సీఎం పదవిలో ఉండి తెలంగాణ తల్లిపై చిల్లర మాటలు మాట్లాడుతున్నాడు. రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధమని ప్రశ్నించారు. రాజీవ్ గాంధీ నోటి నుంచి ఒక్కసారైనా తెలంగాణ పదం ఉచ్ఛరించారా? ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణకు ఏమి ఇచ్చారని నిలదీశారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని సచివాలయం ముందు పెట్టాలని ప్రొఫెసర్ హరగోపాల్ రాహుల్ గాంధీకి లేఖ రాశారు. తెలంగాణ తల్లి విగ్రహంపై కోదండ రామ్ స్పష్టమైన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యేలు పైళ్లా శేఖర్ రెడ్డి, గాదరి కిశోర్ కుమార్, బీఆర్ఎస్ నేత మన్నె గోవర్ధన్ రెడ్డి, ఒంటెద్దు నరసింహా రెడ్డి ఉన్నారు.

# సమస్యలను పక్కదారి పట్టించే చర్యలు

## కాంగ్రెస్, బిఆర్ఎస్‌లపై బండి విమర్శలు



కరీంనగర్, ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త):
అధికార పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ, ఆరు గ్యారంటీ స్కీమ్‌ల హామీలపై చర్చను డైవర్ట్ చేయడానికే విగ్రహాల లొల్లిని తెరపైకి తీసుకొచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల సవాళ్లు, ప్రతి సవాళ్లు ప్రజల దృష్టిని మళ్ళించడానికే అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఆందోళన చెందుతుంటే.. మీకు విగ్రహాల సమస్య వచ్చిందా అని ప్రశ్నించారు. విగ్రహాల సవాళ్ళతో ఏమైనా ఉపయోగం ఉందా అని నిలదీశారు. రైతు రుణమాఫీ ఒక బోగస్ అంటూ విమర్శించారు.ఆరు గ్యారంటీ స్కీమ్‌ల అమలుపై శ్వేత పత్రం విడుదల చేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# రుణమాఫీపై ప్రభుత్వం దోబూచులాట

ఎన్నికలు కాగానే రైతు రుణమాఫీ కోసం రూ. 40 వేల కోట్ల రూపాయలు అవసరమని స్వయంగా ముఖ్యమంత్రే చెప్పారని.. కానీ కేబినెట్ మాత్రం కేవలం 31 వేల కోట్లకు మాత్రమే అనుమతిచ్చిందని అన్నారు. ఇక బ్జడెట్‌లో 26 వేల కోట్లకు మాత్రమే ఆమోదం తెలిపి రైతులను మోసం చేశారని తెలిపారు. బ్జడెట్‌లో కేటాయించిన రూ. 26 వేల కోట్లలో నుంచి కేవలం 18 వేల కోట్ల రూపాయలే ఖర్చు చేసి రైతులను నిలువునా ముంచినట్లు తీవ్రంగా మండిపడ్డారు. రైతు రుణమాఫీ జరగక ఆందోళన చేస్తున్న రైతులకు అండగా ఉండాల్సింది పోయి.. మంత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులను మరింత గందరగోళానికి గురిచేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం 40? మంది రైతులకు కూడా రుణమాఫీ లబ్ది చేకూరలేదని, క్షేత్రస్థాయి నుంచి తమకు సమాచారం అందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరి కారణంగా లక్షలాది మంది రైతన్నలు రోజు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రైతుకు రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీని వెంటనే చేయాలని, ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. డిసెంబర్ 9లోగా రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి ఆ తర్వాత ఆగస్టు 15 అంటూ మరోసారి మాట తప్పారని మండిపడ్డారు. అడ్డగోలు ఆంక్షలు పెట్టి రైతులకు రుణమాఫీ అందకుండా చేసిన రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని హెచ్చరించారు. లక్షలాది మంది రైతన్నలకు అండగా ఉండేందుకు ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువచ్చేందుకే ఈనెల 22వ తేదీన అన్ని మండల కేంద్రాలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతన్నలకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ అందే వరకు భారత రాష్ట్ర సమితి తరఫున ప్రభుత్వంపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# వైద్యుల రక్షణ కోసం నేషనల్ టాస్క్ ఫోర్స్

హైదరాబాద్: ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త):
దేశవ్యాప్తంగా ఆసుపత్రులలో వైద్యుల రక్షణ ఏర్పాట్లను పరిశీలించేందుకు టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇప్పటి వరకున్న చట్టాలు వైద్యుల రక్షణకు సరిపోవని వ్యాఖ్యానించింది. ఈమేరకు మంగళవారం ఆర్జీ కర్ ఆసుపత్రి ట్రెయినీ డాక్టర్ హత్యాచారం కేసు విచారణ సందర్భంగా సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. మరో దారుణం జరిగేంత వరకూ దేశం వేచి ఉండలేదని, డాక్టర్ల రక్షణకు సంబంధించి మరిన్ని ఏర్పాట్లు అవసరమని పేర్కొంది. అదేవిధంగా ఆర్జీ కర్ వైద్యురాలి హత్యాచారం ఘటనను పొలిటికల్ ఇష్యూగా చేయదల్చుకోలేదని సీజేఐ పేర్కొన్నారు. హత్యాచారం ఘటనకు నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై పోలీసు బలగాలతో అణచివేసే ప్రయత్నం చేయొద్దంటూ పశ్చిమ బెంగాల్ సర్కారుకు సూచించింది. సీజేఐ నేతృత్వంలోని ఈ ధర్మాసనంలో జస్టిస్ జేబీ పార్థీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా సభ్యులుగా ఉన్నారు.

### టాస్క్ ఫోర్స్ లో ఎవరెవరు ఉన్నారంటే..

ఆసుపత్రులలో వైద్యుల రక్షణ ఏర్పాట్ల పరిశీలనకు ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ కు సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్ సరైన్ నేతృత్వం వహిస్తారని సుప్రీంకోర్టు పేర్కొంది. డాక్టర్ డి నాగేశ్వర్ రెడ్డి, డాక్టర్ ఎం. శ్రీనివాస్, డాక్టర్ ప్రతిమా మూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్ పూరి, డాక్టర్ సౌమిత్ర రావత్, ఢిల్లీ ఎయిమ్స్ ప్రొఫెసర్ అనితా సక్సేనా, ముంబయి మెడికల్ కాలేజీ డీన్ ప్రొఫెసర్ పల్లవి సప్రే, ఎయిమ్స్ న్యూరాలజీ డాక్టర్ పద్మ శ్రీవాస్తవ ఈ టాస్క్ ఫోర్స్ లో సభ్యులుగా ఉంటారని అత్యున్నత న్యాయస్థానం ప్రకటించింది. ఈ టాస్క్ ఫోర్స్ కు ఎక్స్ అఫీషియో మెంబర్లుగా కేంద్ర కేబినెట్ సెక్రెటరీ, కేంద్ర హెూంశాఖ కార్యదర్శి, కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి, నేషనల్ మెడికల్ కమిషన్ ఛైర్ పర్సన్, నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినర్స్ ప్రెసిడెంట్ ఉంటారని సుప్రీం కోర్టు వెల్లడించింది. మూడు నెలల్లో మధ్యంతర నివేదిక అందజేయాలని టాస్క్ ఫోర్స్ ను ఆదేశించింది.

# 2036 నాటికి

# యువత తగ్గి.. వృద్ధులు పెరిగి..!



## దేశ జనాభాపై ప్రభావం కేంద్ర గణాంకాల శాఖ నివేదిక

**ప్రస్తుతం యువత జనాభా అధికంగా ఉన్న భారతావని.. మరో పుష్కర కాలంలో వయోధికులు ఎక్కువగా ఉన్న దేశంగా మారనుంది.**

**హైదరాబాద్:** ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త): దేశ జనాభాలో 15 ఏళ్లలోపు బాలల శాతం 2036 నాటికి గణనీయంగా తగ్గి 60 ఏళ్లు పైబడినవారి జనాభా పెరగనుంది. దేశ జనాభా 140 కోట్లు కాగా 2036 నాటికి 152.20 కోట్లకు చేరనుంది. 2021లో జనాభా వార్షిక వృద్ధిరేటు 1.08 శాతం ఉంటే 2036 నాటికి అది 0.58కి పడిపోనుంది. ఈ మేరకు దేశ జనాభా పెరుగుదలపై తాజా అంచనాలతో 'భారతదేశంలో మహిళలు-పురుషులు 2023' నివేదికను కేంద్ర గణాంకాల మంత్రిత్వశాఖ విడుదల చేసింది. జనాభా పెరుగుదల తీరు.. వయసుల వారీగా మహిళలు, పురుషుల శాతాలు.. బాలలు, వృద్ధుల సంఖ్యలో మార్పులను వెల్లడించింది. అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు.. సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రానున్న మార్పులకు.. ఏ వయసువారిలో జనాభా పెరుగుదల ఎంత ఉంటుంది? స్త్రీ, పురుష నిష్పత్తి వంటి వివరాలు అత్యంత కీలకమని వివరించింది.

### వర్కింగ్ గ్రూప్‌లో..

ఏ దేశమైనా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే.. జనాభాలో 'రోజూ కష్టపడి పనిచేసే (వర్కింగ్ గ్రూప్)' 15 నుంచి 59 ఏళ్ల వయసున్నవారి శాతం అధికంగా ఉండాలి. మన దేశంలో రాబోయే పదేళ్ల (2026-36)లో ఈ వర్కింగ్ గ్రూప్ శాతం దాదాపు పెరగదని అంచనా. ఉదాహరణకు 2026లో దేశ జనాభా 142.59 కోట్లుంటే వీరిలో వర్కింగ్ గ్రూప్ సంఖ్య 92.39 కోట్లకు (64.79 శాతం) చేరనుందని అంచనా. 2036 నాటికి జనాభా మరో పది కోట్లు పెరిగినా.. వారిలో వర్కింగ్ గ్రూప్ మాత్రం మరో 0.2 శాతంలోపు మాత్రమే పెరిగి వారి జనాభా 98.85 కోట్లకు చేరుతుంది. 15 ఏళ్లలోపు బాలలు తక్కువగా ఉండటంతో పాటు, ఇప్పుడు 47 ఏళ్లలోపు వయసున్న వారంతా 2036 నాటికి 59 దాటిపోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడుతుంది.

### తెలుగు రాష్ట్రాల్లో..

దేశంలో 60 ఏళ్ల వయసు దాటిన జనాభాలో మహిళల శాతం ఎక్కువగా ఉంది. వయసులవారీగా స్త్రీ, పురుష నిష్పత్తిని పరిశీలిస్తే దేశంలోనే అత్యధికంగా వయోధికులైన మహిళలున్న రాష్ట్రాల్లో తెలంగాణ, ఏపీ 5వ స్థానంలో ఉన్నాయి. 60 ఏళ్లు నిండిన ప్రతి వెయ్యిమంది పురుషులకు 1,119 మంది మహిళలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నారు. ఈ సంఖ్యలో కేరళ (1,206), గోవా (1,200), ఛత్తీస్‌గఢ్ (1,159), గుజరాత్ (1,132)లు తొలి 4 స్థానాల్లో ఉన్నాయి. కేంద్రపాలిత ప్రాంతమైన దమన్ దీవ్ 1,331 మందితో దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఆరేళ్లలోపు వారి నిష్పత్తిని పరిశీలిస్తే.. ఏపీలో ప్రతి వెయ్యిమంది బాలురకు 939 బాలికలు ఉండగా.. తెలంగాణలో 937 మంది ఉన్నారు.

### నివేదికలోని ముఖ్యాంశాలు..

వయసులవారీగా జనాభా శాతాల్లో 2036 నాటికి చాలా మార్పులు రానున్నాయి. 2026లో దేశజనాభా 142.59 కోట్లకు చేరనుంది. వీరిలో 15 ఏళ్లలోపు బాలలు 24.4% ఉంటారు. 2036 నాటికి అది 20.5 శాతానికి తగ్గుతుంది. పెళ్లిళ్లు ఆలస్యం కావడం.. సంతానోత్పత్తి రేటు తగ్గడం.. బాలల శాతం పడిపోవడానికి ప్రధాన కారణాలు.

2026-36 మధ్యకాలంలో పురుషుల్లో 60 ఏళ్లు పైబడినవారి శాతం 10.7 నుంచి 12 శాతానికి, మహిళల్లో 13.4 నుంచి 16 శాతానికి పెరగనుంది. బాలల శాతం తగ్గుతుంటే.. వయోధికుల శాతం పెరగనుండటం అనేక హెచ్చరికలను సూచిస్తోంది. ప్రధానంగా 60 ఏళ్లు నిండినవారి సంక్షేమానికి ప్రభుత్వాలు మరింత ఎక్కువగా నిధులు వెచ్చించాల్సి వస్తుంది. పలు

# జగన్ అక్రమాస్తుల కేసు విచారణ సెప్టెంబర్ 17కు వాయిదా



హైదరాబాద్:ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ మరోసారి వాయిదా పడింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలన్న పిల్‌పై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ కేసులప త్వరితగతిన విచారణ జరపాలని హరిరామ జోగయ్య పిల్ దాఖలు చేశారు. ఇప్పటికే జగన్‌తో పాటు సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రజాప్రతినిధుల కేసులను త్వరితగతిన జరపాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని పిటిషనర్ వాదించారు. ఈ క్రమంలో పిటిషన్లపై విచారణను సెప్టెంబర్ 17కు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. మరోవైపు ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకొంటున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి నమోదైన సీబీఐ కేసుల్లో తీర్పు వెలువడిన తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా ఆ పద్ధతినే అనుసరించాలని అప్పట్లో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును గతేడాది మే నెలలో ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆగస్టు 14న ఈడీ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. కేసు ప్రారంభమైన వెంటనే తాను విచారణ నుంచి తప్పుకొంటున్నానని జస్టిస్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. వాదనలు వినిపించేందుకు ఇరుపక్షాల న్యాయవాదులు సిద్ధమవగా జస్టిస్ సంజీవ్ కుమార్ లేని ధర్మాసనం ముందు పిటిషన్‌ను లిస్ట్ చేయనున్నట్టు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. సెప్టెంబరు 2 నుంచి మొదలయ్యే వారంలో సీజేఐ ఆదేశాల మేరకు మరో ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని ఆయన ఆదేశించారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## : కలెక్టర్లతో పొంగులేటి వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్:ఆగస్టు 20 ,(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జనజీవనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మరో ఐదు రోజులపాటు భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదురుకోవడానికి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, నూతన రెవెన్యూ చట్టం -2024 ముసాయిదా, ధరణి దరఖాస్తులు, ఎల్ఆర్ఎస్ తదితర అంశాలపై తెలంగాణ చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి , జిల్లా కలెక్టర్లతో మంగళవారం నాడు ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఐదు రోజుల్లో వర్షాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక పరిస్థితులను బట్టి విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించే నిర్ణయాన్ని కలెక్టర్లు తీసుకోవాలని సూచించారు. గత రాత్రి నుంచి గ్రేటర్ హైదరాబాద్, నిజామాబాద్ తదితర జిల్లాల్లో భారీ వర్షాలు కురిసినా వీలైనంత మేరకు ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పరిస్థితిని గురించి మంత్రిగారు కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ చర్యల గురించి ఆదేశాలు జారీ చేశారు.

# స్థానిక సంస్థల అభివృద్ధి కోసం 1,452 కోట్లు

**జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమం**
**గ్రామాల బలోపేతం లక్ష్యంగా నిధులు**
**పంచాయితీరాజ్ సమీక్షలో చంద్రబాబు వెల్లడి**



అమరావతి,ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త): వచ్చే జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమం నిర్వహిస్తామని సిఎం చంద్రబాబు అన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తామని సీఎం తెలిపారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 990 కోట్లు, జల్ జీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర వాటా రూ. 500 కోట్లు విడుదల చేస్తామని సీఎం చెప్పారు. పంచాయతీ రాజ్ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి వెలుగులు నింపుతామని అన్నారు. పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేస్తామన్నారు. ఒక ఇంటికి, ఒక గ్రామానికి, ఒక ప్రాంతానికి ఏం అవసరమో గుర్తించి.. ఆ సదుపాయాలను కల్పిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సంబంధిత శాఖా అధికారులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే.. స్థానిక సంస్థల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,452 కోట్ల నిధులు విడుదల చేసింది. స్థానిక సంస్థల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని.. సీఎం చంద్రబాబు సూచనల మేరకు నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తే.. తాము బలోపేతం చేస్తున్నామన్నారు. స్థానిక సంస్థల కోసం రూ. 1452 కోట్ల నిధుల విడుదల చేసింది కూటమి ప్రభుత్వం.. గత ప్రభుత్వం పక్కదారి పట్టించిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేస్తున్నట్టు పేర్కొంది.. గ్రామ పరిధిలోని స్థానిక సంస్థలకు రూ. 998 కోట్లు, అర్బన్ పరిధిలోని స్థానిక సంస్థలకు రూ. 454 కోట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల బలోపేతమే ప్రజా కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు స్థానిక సంస్థలకు నిధులు విడుదల చేశాం. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తే.. మేం వాటిని బలోపేతం చేస్తున్నాం అన్నారు.. గ్రామాల అభివృద్ధితోనే దేశ అభివృద్ధి, రాష్ట్ర అభివృద్ధి అని మహాత్మా గాంధీ ఆశయాలను పాటించే ప్రభుత్వం మాది అన్నారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా కూటమి ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. ఈ నిధులతో గ్రామ, వార్డు స్థాయిల్లో పనులను వేగవంతం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఈ నిధుల విడుదలతో స్థానిక సంస్థలకు ఆర్థికంగా వెసులుబాటు కలిగే అవకాశం కలుగుతుందని వెల్లడించారు ఏపీ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్..

# చిన్నారికి జీవితకాలం ఉచిత బస్సు పాస్

## : ప్రసవం చేసిన నర్సుకు ఏడాది ఉచిత ప్రయాణం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ వెల్లడి



గద్వాల ఆగస్టు 20,(జర్నలిస్ట్ వార్త): గద్వాల ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న గర్భిణికి స్టాఫ్‌నర్సు సహాయంతో కండక్టర్ సుఖ ప్రసవం చేయడంపై ఆర్టీసీ యాజమాన్యం, ఎండీ సజ్జనార్ హర్షం వ్యక్తం చేశారు.
ఆర్టీసీ బస్సులో పురుడు పోసుకున్న ఈ చిన్నారికి జీవితకాలంపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు ప్రకటించారు. గద్వాల మండలంలోని కొండపల్లికి చెందిన గర్భిణి సంధ్య సోమవారం రాఖీ పండుగ కోసం ఆర్టీసీ బస్సులో వనపర్తికి వెళ్తుండగా పురిటి నొప్పులు రావడంతో మార్గమధ్యలోనే కండక్టర్ భారతి స్టాఫ్‌నర్సు అలివేలు సహాయంతో సుఖ ప్రసవం చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం మంగళవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో కండక్టర్ భారతి, స్టాఫ్‌నర్సు అలివేలు, బస్సు డ్రైవర్ అంజిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. మహిళకు ప్రసవం చేసేందుకు సహకరించిన స్టాఫ్‌నర్సు అలివేలుకు ఏడాదిపాటు డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీవోవో రవీందర్, సిబ్బంది మునిశేఖర్, కృష్ణకాంత్, శ్రీదేవి, జ్యోతి, గద్వాల డిపో మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# తొలి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

**శ్రీనగర్, ఆగస్ట్ 20:** జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి సంబంధించి తొలి విడత పోలింగ్‌కు కేంద్రం ఎన్నికల సంఘం మంగళ వారం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ రేపటి నుంచి ప్రారంభం కానుంది. ఇక అభ్యర్థుల నామినేషన్ గడువు ఆగస్ట్ 27వ తేదీతో ముగియనుంది. ఆగస్ట్ 28వ తేదీతో అభ్యర్థి నామినేషన్ పరిశీలన గడువు తీరనుంది.



**తొలి విడతలో మొత్తం 24 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు..**

అదే విధంగా ఆగస్ట్ 30వ తేదీతో అభ్యర్థుల నామినేషన్ ఉపసంహరణ గడువు ముగియనుంది. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి తొలి విడత పోలింగ్ సెప్టెంబర్ 18న జరగనుంది. ఈ తొలి విడతలో 24 అసెంబ్లీ స్థానాలు.. పంపోరి, త్రల్, పుల్వామా, రాజ్‌పురా, జైనపూరా, షోపియాన్, డిహెచ్ పొరా, కుల్గాం, దేవసార్, దూర్, కొకెర్నాగ్ (ఎస్టీ), పశ్చిమ అనంత్‌నాగ్, అనంత్‌నాగ్, శ్రీగుఫ్వారా-బిజ్బెహరా, షాంగూస్- అనంతనాగ్ తూర్పు, పెహాల్గామ్, ఇంద్రవాల్, కిష్త్వారా, పెద్దర్ నాగ్సెనీ, భద్రవాహ్, దోడా, దోడా పశ్చిమ, రామబన్, బనిహెల్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి.

**ఆగస్ట్ 16న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన సీఈసీ..**

ఆగస్ట్ 16వ తేదీన జమ్మూ కశ్మీర్‌కు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన సంగతి తెలిసిందే. 90 అసెంబ్లీ స్థానాలున్న ఆ రాష్ట్ర అసెంబ్లీకి మూడు విడతలుగా పోలింగ్ జరగనుంది. సెప్టెంబర్ 18వ తేదీన తొలి విడత పోలింగ్, సెప్టెంబర్ 25వ తేదీన రెండో విడత పోలింగ్, అక్టోబర్ 1వ తేదీన మూడో లేదా తుది విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం కానుంది. దీంతో జమ్మూ కశ్మీర్ ఓటరు ఏ పార్టీకి పట్టం కట్టాడనే విషయం తేటతెల్లం కానుంది.

**దాదాపు దశాబ్దం తర్వాత అసెంబ్లీ ఎన్నికలు..**

ఇక 2014లో జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి చిట్ట చివరిగా ఎన్నికలు జరిగాయి. రెండోసారి అధికారం చేపట్టిన ప్రధాని మోదీ.. జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి సంబంధించిన ఆర్టికల్ 370ని రద్దు చేసింది. దీంతో ఈ ఆర్టికల్ రద్దు అనంతరం జరుగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవి. దీంతో ఈ అసెంబ్లీ ఎన్నికలపై సర్వత్ర ఆసక్తి నెలకొంది.

## శక్తి బిల్లుతో మహిళలు, చిన్నారులపై ఆగడాలకు చెక్



బద్లాపూర్ స్కూల్‌లో చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటన కలకలం రేపడంతో శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే ఈ ఉదంతంపై స్పందించారు. బద్లాపూర్ రైల్వే స్టేషన్‌లో ఈ ఘటనకు నిరసనగా స్థానికులు రైళ్లను నిలిపివేశారు. బద్లాపూర్ ఘటనపై జనాగ్రహం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోందని ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. బద్లాపూర్ స్కూల్‌లో జరిగిన ఘటన దేశవ్యాప్తంగా ఎక్కడా జరగరాదని ఇది అత్యంత విచారకరమని ఠాక్రే ఆందోళన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం శక్తి బిల్లును ఆమోదింపచేసే ప్రయత్నంలో ఉండగానే ప్రభుత్వాన్ని ప్రస్తుత సీఎం ఏక్‌నాథ్ షిండే కూల్చివేశారని అన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసిన వారు ఇప్పుడు అధికారంలో ఉన్నారని వారు శక్తి బిల్లును ఆమోదించి నిందితులపై కఠిన చర్యలు చేపట్టాలని ఉద్ధవ్ ఠాక్రే డిమాండ్ చేశారు. కాగా, బద్లాపూర్ ఘటన తీవ్ర విచారకరమని శివసేన (యూబీటీ) ఎంపీ ప్రియాంక చతుర్వేది అన్నారు. పాలకులు మహిళా హక్కుల కోసం పోరాడతామని, వారికి న్యాయం చేస్తామని ప్రతిసారీ చెబుతుంటారని, కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత మహిళల సమస్యలను ఏ ఒక్కరూ వినిపించుకోరని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ముఖ్యమంత్రి లడ్కీ బహిన్ యోజన పథకం కింద ఎలాంటి ప్రయోజనాలు అవసరం లేదని, మహిళల భద్రతే ముఖ్యమని ఇవాళ బద్లాపూర్ ఘటనకు నిరసన వ్యక్తం చేస్తున్న వారు కోరుతున్నారని ఆమె వివరించారు.

## మంకీపాక్స్‌పై కేంద్ర ఆరోగ్యశాఖ అప్రమత్తం..

**సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో ఐసోలేషన్ వార్డు ఏర్పాటు**



మంకీపాక్స్ ప్రపంచదేశాలను వణికిస్తున్నది. ఆఫ్రికా దేశాల్లో పెద్ద ఎత్తున కేసులు నమోదవుతున్న విషయం తెలిసిందే. రోజు రోజుకు మంకీపాక్స్ పలు దేశాలకు సైతం విస్తరిస్తున్నది. ఇప్పటికే ప్రపంచ ఆరోగ్య సంస్థ మెడికల్ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. మంకీపాక్స్‌పై భారత ప్రభుత్వం సైతం అప్రమత్తమైంది. వైరస్‌ను ఎదుర్కొనేందుకు దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన దవాఖానాల్లో బెడ్‌లను రిజర్వ్ చేయడంతో పాటు ప్రధాన ల్యాబ్‌లను సైతం అప్రమత్తం చేసింది. వ్యాధి నిర్ధారణకు మార్గదర్శకాలను జారీ చేసింది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో రోగులకు ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేసింది. చికిత్స చేయడంతో పరిశీలనలో ఉంచనున్నారు. ఢిల్లీ పరిధిలో పాజిటివ్ కేసులు నమోదైతే.. సదరు రోగులను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో చేర్పించనున్నారు. అలాగే, ఆల్ ఇంఇయా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఐదు పడకలను రిజర్వ్ చేశారు. ఆసుపత్రిలో చేరిన రోగుల్లో ఎవరికైనా మంకీపాక్స్ లక్షణాలు కనిపించినా.. మంకీపాక్స్ అనుమానిత కేసులు వచ్చినా వారిని ఆసుపత్రిలోనే ఏర్పాటు చేసిన బెడ్‌పై ఉంచి చికిత్స అందిస్తారు. ఢిల్లీలోని ఎయిమ్స్, రామ్ మనోహర్ లోహియా హాస్పిటల్, సఫ్దర్‌జంగ్ హాస్పిటల్, లేడీ హార్డింగ్ మెడికల్ హాస్పిల్స్‌ను మంకీపాక్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ అధికారులు కోరారు. అలాగే, వైరస్‌ను ఎదుర్కొనేందుకు రాష్ట్రాల్లోని ఆసుపత్రులకు అవసరమైన మార్గదర్శకాలను సైతం కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ జారీ చేసింది.

### సుప్రీంకోర్టు ప్రస్తావించిన అరుణా షాన్ బాగ్ ఎవరు..

# గొలుసులతో కట్టేసి, పాశవికంగా!

ఢిల్లీ: కోల్ కతా వైద్యురాలి మృతి కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పనిచేసే చోట మహిళలు ఎదుర్కొంటోన్న వేధింపులపై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవీ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మానం ఆందోళన వ్యక్తం చేసింది. వ్యవస్థలో లైంగిక హింస మూలాలు ఉన్నాయని పేర్కొంది. ఇందుకు అరుణా షాన్‌బాగ్ కేసు ఉదాహరణ అని పేర్కొంది.



**అరుణా షాన్ బాగ్ ఎవరు..?**

సుప్రీంకోర్టు ధర్మాసనం ప్రస్తావించిన అరుణ్ షాన్ బాగ్ కూడా వైద్య సేవల్లో పనిచేశారు. 1967లో మహారాష్ట్ర కింగ్ ఎడ్వర్డ్ ఆస్పత్రిలో పనిచేశారు. డాక్టర్ సందీప్ సర్దేశాయ్ వద్ద విధులు నిర్వహించారు ఆమె కెరీర్ చక్కగా సాగుతున్న వేళ.. మరో ఏడాదిలో పెళ్లి చేసుకోవాలని ఎన్నో కలలు కన్నది. అయితే ఆ కలలన్నీ కల్లలయ్యాయి సోహన్ లాల్ అనే వార్డు బాయ్ లైంగిక దాడికి తెగబడ్డాడు. 1973 నవంబర్ 27వ తేదీన దారుణ ఘటన జరిగింది. గొలుసులతో కట్టేసి, అత్యంత పాశవికంగా లైంగికదాడి చేశాడు. దాంతో అరుణా షాన్ బాగ్ మెదడుకు తీవ్రంగా గాయమైంది. తర్వాత ఆమె కోమాలోకి వెళ్లి అచేతనంగా ఉండిపోయింది.

**పనిచేయని మెదడు!**

అరుణా షాన్ బాగ్ మెదడు ఎడమ భాగం పనిచేయలేదు. దాంతో మాట్లాడటం వీలు పడలేదు. కేఈఎం ఆస్పత్రిలో అరుణ కోసం ప్రత్యేక వార్డు కేటాయించారు. అప్పట్లో ఈ కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అరుణను ఆ విధంగా చూసి మెర్సి కిల్లింగ్ (కారుణ్య మరణం)కు అనుమతి ఇవ్వాలని 2011లో జర్నలిస్ట్ ఒకరు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తిరస్క రించింది. దాదాపు నలభై ఏళ్ల అరుణ మంచానికే పరిమిత మైంది. 2015లో న్యూమోనియా సోకి కన్నుమూసింది.

**కోల్ కతాలో కూడా అలానే..**

కోల్‌కతా ఆర్జీ కర్ ఆస్పత్రిలో సంజయ్ అనే వ్యక్తి వైద్యురాలిపై లైంగికదాడికి తెగబడ్డాడు. అతనితోపాటు మరికొందరు ఉన్నారని మృతురాలి పేరంట్స్ ఆరోపిస్తున్నారు. వైద్యురాలి మృతిపై దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. సుప్రీంకోర్టు ధర్మాసనం ఆ కేసును సుమోటోగా స్వీకరించి, మంగళవారం నాడు విచారించింది. ఆ క్రమంలో సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అరుణా షాన్ బాగ్ కేసును ఉదహరించారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తున్న గవర్నర్ : సిద్ధరామయ్య



కర్నాటక గవర్నర్‌ను కాంగ్రెస్ నేతలు అవమానిస్తున్నారని కాషాయ నేతలు చేస్తున్న విమర్శలపై కర్నాటక సీఎం సిద్ధరామయ్య స్పందించారు. గవర్నర్‌ను తాము ప్రశ్నిస్తే అవమానించినట్లు అని నిలదీశారు. శశికళా జొల్లె, మాజీ మంత్రి మురుగేష్ నిరాని, జనార్ధన రెడ్డిపై ఫిర్యాదులున్నాయని సీఎం తెలిపారు. వీరిని ప్రాసిక్యూట్ చేసేందుకు తాము గవర్నర్‌ను కోరినా పర్మిషన్ ఇవ్వలేదని వివరించారు. గవర్నర్ పదవి అనేది రాజ్యాంగబద్ధమైనదని, రాష్ట్రపతి ప్రతినిధిగా ఆయన పనిచేయాలని, కేంద్రం ప్రతినిధిగా వ్యవహరించరాదని సిద్ధరామయ్య స్పష్టం చేశారు. కాగా ముడా స్కామ్‌లో కర్నాటక సీఎం సిద్ధరామయ్య ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర గవర్నర్ అనుమతించడం కర్నాటక రాజకీయాలను కుదిపేసిన సంగతి తెలిసిందే. మరోవైపు ముడా స్కామ్‌లో కర్నాటక సీఎం సిద్ధరామయ్యపై బీజేపీ చేస్తున్న ఆరోపణలు సత్యదూరమని కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా తోసిపుచ్చారు. రాజకీయ దురుద్దేశంతోనే సిద్ధరామయ్యపై కాషాయ పార్టీ అవినీతి ఆరోపణలు గుప్పిస్తోందని దుయ్యబట్టారు. బీజేపీ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవాలు లేవని అన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఎన్నికైన తమ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కాషాయ నేతలు ప్రయత్నించారని, మహారాష్ట్ర, జార?ండ్‌లో కూడా అదే జరిగిందని ఆరోపించారు. కాషాయ నేతలు ఇప్పుడు కర్నాటకలో సిద్ధరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్‌ను కూలదోసేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారని, వారి ప్రయత్నాలు ఫలించబోవని పవన్ ఖేరా స్పష్టం చేశారు.

# జమ్మూ కశ్మీర్‌కు ఖర్గే, రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్ట్ 20: జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికల నగారా మోగింది. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలే కాదు.. జాతీయ పార్టీలు సైతం వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. అలాంటి వేళ.. ఆగస్ట్ 21, 22 తేదీల్లో జమ్మూ కశ్మీర్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోపాటు ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పర్యటించనున్నారు. జమ్మూ, శ్రీనగర్‌లోని పార్టీ కీలక నేతలతోపాటు పార్టీ శ్రేణులతో వారు భేటీ కానున్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ విజయావకాశాల కోసం తీసుకు కోవాల్సిన చర్యలపై వారితో వీరిరువురు చర్చిస్తారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఎక్స్ వేదికగా వివరించారు. బుధవారం మధ్యాహ్నం ఖర్గే, రాహుల్ జమ్మూ చేరుకుంటారు. అనంతరం వారు.. పార్టీ శ్రేణులతో సమావేశమవుతారు. ఆ తర్వాత శ్రీనగర్ చేరుకుని.. పార్టీ కీలక నేతలతో భేటీ కానున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఇంత పార్టీలతో కాంగ్రెస్ పార్టీ జత కట్టే అవకాశముందని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు. అధికారంలోకి రాకుండా బీజేపీని నియంత్రించే క్రమంలో ఈ నిర్ణయం తీసుకునే అవకాశముందని పేర్కొన్నారు. మరోవైపు నాలుగు రాష్ట్రాలు.. హరియాణ, మహారాష్ట్ర, జమ్మూ కశ్మీర్, జార?ండ్ అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జ్‌లు, స్క్రీనింగ్ కమిటీ సభ్యులతో సోమవారం న్యూఢిల్లీలో ఖర్గే, రాహుల్ సమావేశమై



చర్చించిన సంగతి తెలిసిందే. జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మూడు విడుతల్లో జరగనున్నాయి. అందులోభాగంగా తొలి విడత నోటిఫికేషన్ మంగళవారం ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. ఈ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 4వ తేదీ వెలువడనున్నాయి. ఆర్టికల్ 370 రద్దు అనంతరం జరగుతున్న తొలి అసెంబ్లీ ఎన్నికలు ఇవి. ఈ నేపథ్యంలో అధికారాన్ని హస్త గతం చేసుకునేందుకు అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ పార్టీలే కాకుండా.. ఆ రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు సైతం ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నాయి. ఇంకోవైపు బీజేపీ అగ్రనేతలు ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తోపాటు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సైతం జమ్మూ కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు.

## ఆ యాడ్స్‌ను రద్దు చేయండి.. యూపీఎస్సీకి లేఖ రాసిన కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్

యూపీఎస్సీ చైర్మన్‌కు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ మంగళ వారం లేఖ రాశారు. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌కి సంబంధించి జారీ చేసిన ప్రకటనలను రద్దు చేయాలని యూపీఎస్సీని కోరారు. లేటరల్ ఎంట్రీ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీల భర్తీ విధానంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో కేంద్రం వెనక్కి తగ్గింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు లేఖలో మంత్రి పేర్కొన్నారు. సామాజిక న్యాయంపై మోదీ ప్రభుత్వం దృష్టి సారించిందని.. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. 2005లో వీరప్ప మొయిలీ నేతృత్వంలోని రెండో అడ్మినిస్ట్రేషన్ రిఫార్మ్స్ డైరెక్ట్ ప్రవేశాలకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని.. 2013లో ఆరవ వేతన సంఘం సిఫారసులు సైతం అదే దిశలో ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. అయితే, అంతకు ముందు చాలా హై ప్రొఫైల్ కేసులు లేటరల్ ఎంట్రీకి వచ్చాయని.. గత ప్రభుత్వాల్లో వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, ఉడాయ్ లీడర్‌షిప్ తదితర కీలకమైన పోస్టుల్లో రిజర్వేషన్ లేకుండా లేటరల్ ఎంట్రీ హోల్డర్లకు అవకాశం ఇచ్చారన్నారు. 2014కి ముందు చాలా వరకు రిక్రూట్‌మెంట్లు కాంటాక్టు ప్రాతిపదికపై లేటరల్ ఎంట్రీ ద్వారా జరిగాయని.. తమ ప్రభుత్వం ఈ ప్రక్రియను సంస్థాగతంగా, బహిరం గంగా, పారదర్శకంగా చేసేందుకు ప్రయత్నించిందన్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న సమానత్వం, సామాజిక న్యాయం సూత్రాలకు అనుగుణంగా ప్రవేశ ప్రక్రియ సామరస్యపూర్వకంగా ఉండాలని, ప్రత్యేకించి రిజర్వేషన్ నిబంధనల



నేపథ్యంలో ఉండాలని ప్రధాని భావిస్తున్నారన్నారు. ఇదిలా ఉండగా.. లేటరల్ ఎంట్రీ పద్ధతిలో 45 మంది సంయుక్త కార్యదర్శులు, ఉప కార్యదర్శులు, డైరెక్టర్ల నియామకానికి యూపీఎస్సీ ఇటీవల దరఖాస్తులు ఆహ్వానించగా.. దీన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను లాక్కుంటున్నారని కేంద్రంపై విమర్శలు గుప్పించారు. ఉన్నత స్థానాల్లో అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం దక్కడం లేదన్న ఆయన.. లేటర్ ఎంట్రీ ద్వారా మరింత అందకుండా చేస్తున్నారన్నారు. అయితే, రాహుల్ వ్యాఖ్యలపై ఇప్పటికే కేంద్రమంత్రులు మండిపడ్డారు.

## చంద్రయాన్ 4, 5 డిజైన్లు పూర్తి.. కేంద్రం ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాం: ఇస్రో చైర్మెన్



**న్యూఢిల్లీ:** చంద్రయాన్ ప్రాజెక్టుకు చెందిన కొత్త అప్‌డేట్స్ ఇచ్చారు ఇస్రో చైర్మెన్ డాక్టర్ ఎస్ సోమనాథ్. చంద్రుడి మీదకు వరుసగా వ్యోమనౌకలను పంపినట్లు చెప్పిన ఆయన.. చంద్రయాన్ 3 సక్సెస్ అయినట్లు వెల్లడించారు. అయితే ప్రస్తుతం చంద్రయాన్ 4, 5 ప్రాజెక్టు డిజైన్లు పూర్తి అయ్యాయని, ఆ డిజైన్లకు ప్రభుత్వం నుంచి అనుమతి కోసం ఎదురుచూస్తున్నట్లు ఇస్రో చైర్మెన్ తెలిపారు. ఎల్‌వీఎం3 రాకెట్ తయారీ ఖర్చును తగ్గించేందుకు ప్లాన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎవీఎం3 రాకెట్ తరహాలో కొత్త రాకెట్‌ను అభివృద్ధి చేస్తున్నామని, ఇది పేలోడ్‌ను మూడు రెట్లు అధికంగా మోసుకెళు ందని ఆయన తెలిపారు. ఆగస్టు 23వ తేదీన జాతీయ అంతరిక్ష దినంగా పాటించనున్నట్లు చెప్పారు. 23ను నేషనల్ స్పేస్ డేగా కేంద్ర సర్కారు ప్రకటించిన విషయం తెలిసిందే.


ప్రియాంక అరుల్ మోహన్

# ఓజీలో భాగస్వామ్యం కావడం అదృష్టం

ప్రముఖ కథానాయకుడు పవన్ కల్యాణ్ నటిస్తోన్న చిత్రం 'ఓజీ' ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ సుజీత్ దర్శకత్వంలో రానుంది. ఇందులో పవన్ సరసన ప్రియాంక అరుల్ మోహన్ కనిపించనున్నారు. తాజాగా 'సరిపోదా శనివారం' ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రియాంక మాట్లాడుతూ 'ఓజీ' అవకాశం గురించి పంచుకున్నారు. 'ఓజీ లాంటి గొప్ప కథలో భాగం కావడం, వపన్ సర్ పక్కన నటించడం నా అదృష్టం. ఆ అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు ధన్యవాదాలు. పవన్ కల్యాణ్, నాని ఇద్దరూ క్రియేటివ్‌గా ఉంటారు. నాని సినిమాల గురించి ఎప్పుడూ కలలు కంటారు. పవన్ ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తుంటారు' అని ప్రియాంక చెప్పారు. పవన్ కల్యాణ్ ప్రజల్లోకి వెళ్లడం కోసమే సినిమాల్లోకి వచ్చారేమో అనిపిస్తుంటుందని హీరో నాని అన్నారు. ఇక తాజాగా 'ఓజీ' గురించి హరీశ్ శంకర్ కూడా మాట్లాడారు. 'ఓజీ' టీజర్ చూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. దానికి తమన్ అందించిన సంగీతం మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. ఈ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. వీళ్లిద్దరూ 'ఓజీ' గురించి చెప్పడంతో ఎక్స్‌లో ఈ హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్ అవుతోంది. ఈ సినిమా విషయానికొస్తే.. ముంబయి - జపాన్ బ్యాక్‌డ్రాప్‌లో గ్యాంగ్‌స్టర్ కథాంశంతో ఈ సినిమా సిద్ధమవుతోంది. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. అర్జున్ దాస్, వెంకట్, శ్రియారెడ్డి తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. దీని గ్లింప్స్‌కు భారీ స్పందన వచ్చిన విషయం తెలిసిందే.

# ఇప్పుడంతా ఇమ్మాన్వీ ఇస్మాయిల్ కోసం సర్చ్

**ప్రభాస్‌తో సినిమాతో స్టార్ స్టేటస్**

ప్రభాస్ పక్కన కథానాయికగా కొత్తమ్మాయి అనగానే, సోషల్‌మీడియా ఫోకస్ అంతా ప్రస్తుతం ఇమాన్వీ ఇస్మాయిల్ పైనే. అసలు ఈ అమ్మాయి ఎవరు.. ఎక్కడ్నుంచొచ్చింది? అంటూ ఆరాలు మొదలయ్యాయి. ప్రభాస్ పుణ్యమా అని రాత్రికి రాత్రి ఈ అమ్మాయి స్టేటస్ మారిపోయింది. తన ఇన్‌స్టాలో ఏకంగా లక్షమంది ఫాలోవర్లు ఒక్కరోజులో పెరిగిపోయారు. శంఖంలో పోస్తేనే కదా తీర్థం అన్నట్టు, ప్రభాస్ పక్కన హీరోయిన్ అనగానే స్టార్ అయి కూర్చుంది ఇమాన్వీ. బడా నిర్మాతలంతా ప్రభాస్ సినిమా తర్వాత తమ సినిమాల్లో ఈ అమ్మాయిని నటింపజేయడానికి అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం చేశారట. అయితే.. మైత్రీ మూవీమేకర్స్ వాళ్లు మాత్రం తమ సంస్థలో ముందు మూడు సినిమాలు చేసేంతవరకూ ఇతర సినిమాలు ఒప్పుకోకూడదని కండీషన్ పెట్టారట ఈ ముద్దుగుమ్మకు. అంతేకాదు, దర్శకుడు అను రాఘవపూడి కూడా తన సినిమా పూర్తయ్యేంత వరకూ మరో సినిమా చేయడానికి వీల్లేదని షరతు విధించారట. ప్రభాస్‌తో ఆయన చేసే సినిమాకు కథానాయిక ఎవరైనా సరే, బల్క్ డేట్లు తనకు అవసరమట. పిలిచినప్పుడల్లా సెట్‌కి రావాల్సి ఉంటుందట. అందుకే బిజీ కథానాయికలను పక్కనపెట్టి ఇమాన్వీని తీసుకున్నారట అను రాఘవపూడి. ఏదేమైనా ఈ అందాలభామ రొట్టె విరిగి నేతిలో పడిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.






# యువీ జీవితం ఆధారంగా బయోపిక్

క్రీడా రంగానికి చెందిన బయోపిక్‌లు ఇప్పటికే ఎన్నో వెండితెరపై అలరించాయి. ఆయా వీరుల కథలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. ఇప్పుడు వాటి సరసన క్రికెటర్ యువరాజ్ సింగ్ బయోపిక్ కూడా చేరనుంది. భారతీయ క్రికెట్ చరిత్రలో యువరాజ్ సింగ్ ఓ సంచలనం. ఒక్క ఓవర్‌లో ఆరు సిక్స్‌లు కొట్టిన ఘనత ఆయనది. ఇప్పుడీ క్రికెట్ వీరుడి జీవిత చరిత్ర సినిమాగా రానుంది. తాజాగా దీనిపై అధికారిక ప్రకటన రావడంతో సినీ, క్రీడాభిమానులు ఆనందపడుతున్నారు. బాలీవుడ్ ప్రముఖ నిర్మాణసంస్థ టీ సిరీస్ యువరాజ్ సింగ్ బయోపిక్‌ను రూపొందించనుంది. నిర్మాతలు భూషన్ కుమార్ , రవిభాగ్ చందక్ ఈ విషయాన్ని వెల్లడించారు. త్వరలోనే దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో హీరోగా ఎవరు కనిపిస్తారా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అంతే కాదు యువీ బయోపిక్‌లో ఏం చూపిస్తారనేది కూడా చర్చ మొదలైంది. యువరాజ్ సింగ్ జీవితం ఓ పోరాటం. క్యాన్సర్‌తో పోరాడి ఆయన ఎంతోమందిలో మనోధైర్యాన్ని నింపారు. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచారు. అయితే ఇప్పుడీ చిత్రంలో కేవలం క్రికెట్‌కు సంబంధించిన విషయాలనే చెబుతారా లేదా క్యాన్సర్‌తో అతడు చేసిన పోరాటాన్ని కూడా చూపిస్తారా అన్నది తెలియాలంటే కొంతకాలం వేచిచూడాల్సిందే!

# అర్షద్ వార్సీ వ్యాఖ్యలపై సుధీర్ బాబు కౌంటర్!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ని ఉద్దేశించి బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. కల్కిలో ప్రభాస్ పాత్రని ఉద్దేశించి అదొక జోకర్ రోల్ అని...ప్రభాస్ తనకి జోకర్ లా కనిపించాడని సంచలన వ్యాఖ్యలు చేసాడు. దీంతో ప్రభాస్ అభిమానులు ఒక్కసారిగా భగ్గుమన్నారు. టాలీవుడ్ నుంచి పలువురు సెలబ్రిటీలు ఇప్పటికే స్పందించారు. ఈ నేపథ్యంలో తాజాగా యంగ్ హీరో సుధీర్ బాబు కూడా వార్సీ వ్యాఖ్యలపై కౌంటర్ వేసాడు.నిర్మాణాత్మ కంగా విమర్శించినా పర్వాలేదు. కానీ ఇలా తప్పుగా మాట్లాడవద్దు. వార్సీలో వృత్తినైపుణ్యం లోపించింది. ప్రభాస్ స్థాయి చాలా పెద్దది. అలాంటి వ్యాఖ్యలు చేసి ఉండకూడదు అని అన్నారు. ప్రభాస్ కి మద్దతుగా ఇప్పటికే నిర్మాత అభిషేక్ అగర్వాల్, సాయికుమార్ ఎస్ కె.ఎన్ నిలిచారు. అర్షద్ వార్సీ వ్యాఖ్యల్ని ఖండించి తప్పుడు వ్యాఖ్యలు చేసినట్లుగా ఆగ్రహం వ్యక్తం చేసారు. అయితే ఇది సరిపోదు. ఇంకా టాలీవుడ్ నుంచి చాలా మంది స్పందించాల్సి ఉంది. అర్షద్ వార్సీ ఈ వ్యాఖ్యలు చేసి కొన్ని గంటలవుతుంది. కొంతమందే స్పందించారు. చెప్పాలనుకున్న వాళ్లంతా ఓపెన్ గా తమ అభిప్రాయాల్ని ఎక్స్ వేదికగా పంచుకున్నారు. అయితే వార్సీ వ్యాఖ్యలపై ఇంకా ప్రభాస్ గానీ, అతని కుటుంబ సభ్యులుగానీ స్పందించలేదు. అలాగే ఇండస్ట్రీలో ఆయన సన్నిహితులు కూడా ఎలాంటి రిప్లై ఇవ్వలేదు. ప్రస్తుతం ప్రభాస్ మళ్లీ షూట్ లో బిజీ అయ్యే పనిలో ఉన్నారు. ఇటీవలే హనురాఘవపూడితో పౌజీ చిత్రాన్ని పట్టాలెక్కించిన సంగతి తెలిసిందే. అలాగే మారుతితో రాజాసాబ్ షూట్ ని పూర్తి చేయాల్సి ఉంది.



# అభిమాని గుండెపై రానా దగ్గుబాటి ఆటోగ్రాఫ్!

టాలీవుడ్ హల్క్ రానా దగ్గుబాటి ఎంత సరదాగా ఉంటాడో చెప్పాల్సిన పనిలేదు. సహనటులతో ఎతో సరదాగా మెలుగుతుంటాడు. ఆఫ్ ది స్క్రీన్ అన్ ది స్క్రీన్ అంటూ ఎలాంటి తేడా ఉండదు. అందరితో కలిసిపోవడం అతడి నైజం. యంగ్ హీరోల్ని ఎంకరేజ్ చేయడంలో అంతే ఆసక్తి చూపిస్తుంటాడు. రామానాయుడు మనవడు అయినా? ఎంతో సింపుల్ గా ఉంటాడు. తాజాగా మరో సందర్భంతో తన సింప్లిసిటీ మరోసారి బయట పడింది. ప్రస్తుతం రానా అమెరికా వెకేషన్‌లో ఉన్నాడు. అక్కడ అందమైన ప్రదేశాల్లో విహరిస్తూ ఎంజాయ్ చేస్తున్నాడు. తాజాగా చికాగోకి కారులో ప్రయాణిస్తున్న రానాని ఓ అభిమాని చూసాడు. డ్రైవింగ్ చేస్తూనే పరస్పరం పలకరించుకున్నారు. రానా కూడా హాయ్ అంటూ ఎంతో ప్రేమగా అభిమానిని పలకరించాడు. కారు అద్ద కిందకు దించే చేతులూపి మరీ హాయ్ చెప్పాడు. అంతేకాదు ఒక అడుగు ముందుకేసి తానే చొరవ తీసుకుని అభిమాని కారుకి అడ్డంగా రానా కారుని పెట్టాడు. దీంతో ఆ అభిమాని కారు ఆపి వెంటనే కుటుంబంతో పాటు కిందకు దిగాడు. రానా వెంటనే ఆ అభిమానిని ఎంతో ఆప్యాయంగా హత్తుకున్నాడు. ఎంతో ఎమోషనల్ అయిపోయారు. రానా కూడా తన ఫ్యాన్‌తో పాటు ఆయన ఫ్యామిలీని కూడా పలకరించరు. అందరూ కలిసి సరదాగా ఫొటోలు దిగారు. అయితే ఆ ఫ్యాన్ తన గుండెలపై ఆటోగ్రాఫ్ చెయ్యాలంటూ రానాను కోరారు. దీనికి ముందు రానా వద్దన్నాడు. అయినా వినకుండా తన షర్ట్‌పై ఆటోగ్రాఫ్ చేయించుకున్నారు ఆ ఫ్యాన్. అలానే తన కారుపై కూడా సైన్ చేయాలంటూ కోరారు. ఆయన అభిమానాన్ని చూసి రానా కూడా ఫిదా అయిపోయాడు. కోరినట్లుగానే కారుపై ఆటోగ్రాఫ్ చేశాడు. దీనికి సంబంధించిన ఓ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. 'అందుకే అన్నా.. నువ్వంటే మాకిష్టం' అంటూ ప్రశంసల కురిపిస్తున్నారు.

